# మిగిలినదెంత?

గోటేటి లలితా శేఖర్



పావనమూర్తి లెక్కల్లో మనిషి, లెక్కల మనిషి. జీవితంలో దేన్ని కూడాలో, దేన్ని తీసివేయాలో, దేన్ని గుణించాలో బాగా తెలిసిన మనిషి.


పుడుతూనే ఏడవకుండా పైకి చూస్తున్న పావనమూర్తిని చూసి బిడ్డ కేర్‌మంటం లేదని అందరూ బెంబేలు పడ్డారు. కానీ పావనమూర్తి ఇంటికున్న ద్వారబంధాల్ని, కిటికీ వూచల్ని లెక్కిస్తున్నాడని వాళ్ళకు తెలియదు.

అక్షరాభ్యాసం చేయించి బళ్ళో వేసిన రోజునే పన్నెండ్లు పన్నెండ్లు ఎక్కాలప్పజెప్పి మేష్టర్లందర్నీ ఆనందంలో ముంచేశాడు పావనమూర్తి. ఇంకో వరాహమిహిరుడో, మరో రామానుజుండో పుట్టేశాడన్నారందరూ.

అలా అలా ఛక ఛకా చదివేసి బి.కామ్ ఫస్టున పాసైయ్యాడు. పావనమూర్తిది అతి సామాన్య కుటుంబం. అందరిలో కడగంటి వాడైన కొడుకు తెలివితేటల మీద తండ్రి బోలెడు ఆశ పెట్టుకున్నాడు. అంతేగానీ ఏ బరువు, బాధ్యతల్నీ

## దీన్నేమంటారు?

పూర్వం రోజుల్లోనయితే ఒక [illegible] అమ్మాయికి మోజుపడి వుంగరం తొడిగితే దాన్ని గాంధర్వ వివాహం అనేవారు. [illegible] చేతికి హరి వెంకట్ ప్రేమగా వుంగరం తొడిగేడు. దాన్ని భద్రంగా దాచుకున్నాను. ఇదేదో ప్రేమకి చిహ్నమనుకున్నాను. అయితే 'హరివెంకట్' మరో అమ్మాయిక్కూడా వుంగరం తొడిగాడని తెలిసింది. మరి దీన్నేమంటారు? అంటోంది అమీషా.



పావనమూర్తి భుజాన్నుంచలేదు. మిగిలిన సంతానానికి, శక్తికొద్దీ చదువులు చెప్పించి, పెళ్ళిళ్ళు చేసి, చివరిరోజులు పావనమూర్తి నీడలో విశ్రాంతిగా గడిపెయ్యాలని ఆశపడ్డాడు.

పావనమూర్తికి గణించడంలోని ఆనందం, గణించినదాన్ని గుణించడంలోని గొప్పదనం ఏమిటో అర్థమైపోయింది.

బ్యాంక్ క్లర్కుగా ఉద్యోగం సంపాదించుకున్న పావనమూర్తికి సామాన్య కుటుంబం నుంచి ఓ పిల్లని తెచ్చి పెండ్లి చేశాడు తండ్రి. పెళ్ళి సంబంధం ఆర్థికంగా పెద్దగా లాభసాటి గాకపోయినా తన లెక్కల జీవితానికి అడ్డు రాకుండా ఉండాలంటే, ధనవంతుల ఇళ్ళలోంచి గాక పేద పిల్లను చేసుకోవడమే ఉత్తమమని లెక్కించాడు పావనమూర్తి.

భార్య సుమతి త్వరలోనే భర్త మెదడును తూకం వేసి, అడుగుల్ని లెక్కించి, ఆలోచనల్ని చదివి, తగిన భార్య అనిపించుకుంది.

మొదటిరోజు కాపరంతో సొరకాయ తెచ్చిన పావనమూర్తి కాయను ఆరు భాగాలుగా చేసి ఆరు రోజులూ, కూరా, పప్పు, పులుసూ వగైరా చేయమని ఆదేశించాడు భార్యని. ఏడవరోజున తొక్కుతో పచ్చడి చేసిన సహధర్మచారిణి నేర్పరితనానికి, పొదుపరితనానికి, పొంగిపోయాడు. భార్యను ఎన్నుకోవడంలో తన లెక్క తప్పుకానందుకు దేవుడికి కొబ్బరికాయ కొట్టాడు.

పావనమూర్తికి దైవభక్తి అపారం. దేవుడు భక్తసులభుడని కనిపెట్టేశాడు. అంతేగాకుండా మనిషి చేతిలో ఏమీ లేదని కేవలం లెక్కించడం వరకే తాను చేయగలననీ, మిగిలిన పని దేవుడు చేయవలసిందేననీ కనిపెట్టి హోల్‌సేల్ కొబ్బరికాయల దుకాణంలో బేరం కుదుర్చుకుని నాలుగురూపాయల అరవైపైసలు పెట్టి ఓ కొబ్బరికాయ తెచ్చి గుళ్ళో కొట్టి "దేవా! నా లెక్కలు తప్పకుండా చూడు" అని దణ్ణం పెట్టాడు. పూజారి తెచ్చిన కొబ్బరి చిప్పందుకుని భార్యకు అనుగ్రహించాడు. భక్తిగా కళ్ళకద్దుకుని సుమతి కొబ్బరితో పచ్చడి చేసి పీచుతో అంట్లు తోముకుని, ఖాళీ చిప్పలో ముగ్గుపోసుకుని ముచ్చటగా కాపరం చేస్తోంది.

పావనమూర్తి బ్యాంక్‌లోను సంపాదించి, తండ్రి తన వద్ద దాచుకున్న ప్రావిడెంటు ఫండ్‌ను కలిపి ఓ పెంకుటిల్లు కొనేసుకుని ఇంటివాడై పోయాడు.

అద్దె ఇళ్ళ బాధ పోయినందుకు తండ్రి చాలా ఆనందించాడు. కానీ ఆనందం అట్టేకాలం నిలవకుండా, మరో ఇంట్లోకి మారవలసిందిగా తల్లికి, తండ్రికీ చెప్పేశాడు.

"ఇదేం అఘాయిత్యంరా? ఇందులో కొంత నా డబ్బు ఉందిగా" ఆక్రోసించాడు పితృదేవుడు.

అది ఆరునెలల అద్దెకూ, నెలనెలా కట్టే కరంటు బిల్లులకూ, సంక్రాంతికి గోడకు పూసిన సున్నం ఖర్చులకూ, పాయిఖానా శుభ్రం చేసే నెలవారీ ఖర్చులకూ, తల్లికి కొన్న మందుల ఖర్చులకూ ఎలా సరిపోయిందో లెక్కలు చేసి చూపాడు పావనమూర్తి.

చేసేదిలేక కళ్ళనీళ్ళతో ఇల్లొదిలారు తల్లీ తండ్రి. పావనమూర్తి ముగ్గురి బిడ్డల తండ్రి అయ్యాడు. మూడోసారి గర్భం ధరించిన భార్యమీద లెక్క తప్పినందుకు కేకలేసి చిరాకుపడ్డాడు.

పావనమూర్తి ఇంటి ఖర్చులు పెరుగుతున్నాయి. అంత కంటే వేగంగా అతని ఆలోచనలు పెరిగాయి. బ్యాంక్ టెస్ట్‌లన్నీ గట్టెక్కి మేనేజరై కూర్చున్నాడు. పకడ్బందీగా లెక్కలు గట్టి పెద్దలనబడేవార్లకు పెద్ద పెద్ద లోన్లు శాంక్షను చేయించి, చిన్న చిన్న కమీషన్లు తీసుకున్నాడు. ఇంటిపక్క ఖాళీజాగాలో మేడ కట్టాడు. అద్దెవాటాలు చేసి అద్దెకిచ్చాడు. కొడుక్కు స్కూటరు కొన్నాడు. భార్యకు బంగారు నగలు చేయించాడు. ఆడపిల్లల పేర్న కట్నాల నిమిత్తం ఎక్కౌంట్లు ఓపెన్ చేశాడు. ఇన్ని చేస్తున్నా కొబ్బరికాయలు కొట్టడం మర్చిపోలేదు పావనమూర్తి.

ఆ రోజు గుళ్ళోంచి వస్తూంటే పురాణ శాస్త్రులు మైక్‌లో మాతృభక్తి ప్రాశస్త్యం వివరిస్తున్నాడు. ఇంటికొచ్చిన పావనమూర్తి తల్లిని చీర కొనుక్కో వలసిందంటూ అక్షరాలా వందరూపాయలు మనియార్డరు చేశాడు. మూడో రోజున "మీ మాతృభక్తి మా కవసరం లేదంటూ" తండ్రి డబ్బు తిరక్కొట్టాడు. సుమతి ధుమధుమలాడింది.

జ్వరం పడ్డ భార్యకు సహాయార్థం అత్తమావల ప్రవేశం ఇంట తప్పనిసరి అయ్యింది. సుమతికి జ్వరం తగ్గేసరికి రెండు వారాలు పట్టింది. ఇంట్లో పనిమనిషి మానేసి కూడా రెండు వారాలయ్యింది. అత్తగారూ, అటు వంటమనిషిగా, ఇటు పనిమనిషిగా ద్విపాత్రాభినయం చేయటం పావనమూర్తి దంపతులకు సంతోషం కలిగించి నప్పటికీ, మూడోవారం వచ్చేసరికి, మావగారు మరి రెండు సార్లు తాగే కాఫీ ఖర్చులకూ, ఉప్మా జీడిపప్పు ఖర్చులకు అతనికి లెక్కలు కుదరలేదు.

ఆ ముక్కే భార్యతో చెప్పాడు పావనమూర్తి. మరునాడే సుమతి తల్లిమీద యుద్ధం ప్రకటించింది. కూరలో నూనె ఎక్కువేస్తున్నావ్ అంది. బట్టల సబ్బు పూరికే అరిగిపోతోందని, మీ మూలంగా అదనంగా మరో ఫ్యాను తిరగటం వల్ల కరెంటు బిల్లు మరో యాభైకు పెరిగిందంది.

"ఇదేం చోద్యమే తల్లీ! పనులకోసం రమ్మన్నావు. పిల్లలకు జ్వరాలన్నావు. ఊరగాయ లన్నావు. నీకు అబ్బాయికీ గవజ బిళ్ళలన్నావు గ్రహణి అన్నావు. ఇదెక్కడి అన్యాయమే అమ్మా! పొట్టల్ని ఇళ్ళలో ఒదిలేసుకురమ్మంటావా ఏమిటి?" అని నిలేసింది.

ఆవిడ కళ్ళనీళ్ళు చూసి సుమతి మరింత ఆవేశపడింది. నీకు విశ్వాసం లేదంది. క్రితం సంవత్సరం మా ఆయనకు తెలీకుండా నీకు పాత పట్టు చీర ఇచ్చానంది. ఊరగాయలు పెట్టినప్పుడు మిగిలిపోయిన పావుకేజీ పాత ఆవకాయ పట్టుకెళ్ళమన్నానంది. ఆరునెలలు వాడిన చెప్పులు ఇచ్చానంది. కుంకుడికాయలు కొట్టుకునే

**(67వ పేజీ చూడండి)**

## డోంట్‌కేర్

“ఎవరో ఏదో అన్నారని, ఎవరో ఏదో అంటారని పట్టించుకునే రోజులే అయితే అసలు ఇండస్ట్రీకే వచ్చేదాన్ని కాను అంటోంది సుమన్ రంగనాథ్. నాయిష్టం నా బాయ్‌ఫ్రెండ్స్‌తో నేను తిరుగుతాను. మిగతా వాళ్ళకేం బాధ? వాళ్ళ బాయ్‌ఫ్రెండ్స్‌కి సైట్ కొట్టడం లేదు కదా?” అంటూ ఎదురు ప్రశ్న వేస్తోంది.

(కొడితే మాత్రం తప్పేముంది?)



గుండ్రాయి ఇచ్చానంది.

సుమతి ఆవేశం చూసి, ఆగ్రహించి, ఆవేదన చెందిన తల్లి, తండ్రి వెళ్ళిపోయారు.

పావనమూర్తి ఏమీ బాధపడలేదు. పాలనూ, నీళ్ళను వేరు చేయగలిగే హంసలా, చిన్నా, పెద్దకూ తారతమ్యం తెలుసున్న జ్ఞానిలా ఊళ్ళో రాజకీయనాయకులకూ, డాక్టర్లకూ, ఆఫీషియల్స్‌కూ ధనికులకూ ఘనంగా విందులిచ్చాడు. నీళ్ళలాంటి తోబుట్టువుల్నీ, బంధువుల్నీ మరిచిపోయాడు.

పావనమూర్తి ఇచ్చిన విందుల్ని పదేపదే అందుకున్న అగ్రగణ్యులు, పావనమూర్తికి చిన్న,చిన్న సాయాలు చేశారు. దాంతో పిల్లల పెళ్ళిళ్ళు, చదువులూ, ఉద్యోగాలూ పూర్తి చేసుకున్నాడు.

పిల్లలంతా లెక్క ప్రకారం ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు. పావనమూర్తి, భార్య సుమతి మిగిలిపోయారు. పావనమూర్తి తల్లిదండ్రులు

## మిగిలినదెంత?

(51వ పేజీ తరువాయి)

పరమపదించారని, సుమతి తల్లి, తండ్రి కూడా కాలధర్మం చేశారని ఎవరో చెప్పగా విన్నాడు. ఎవరు ఎలాపోతే తనకేం? తన కొబ్బరికాయల భక్తికి మెచ్చిన భగవంతుడు తన లెక్కల్ని రైటు కొట్టినందుకు సంతోషించి మరిన్ని కొబ్బరికాయలు కొట్టచ్చుననే సదుద్దేశ్యంతో తీర్థయాత్రలు చేశాడు. కాలం లెక్క ప్రకారం నడచిపోతోంది.

పావనమూర్తి కూడా వృద్ధుడైనాడు. పిల్లల రాకపోకలు తగ్గినవి. తండ్రి నేర్పిన లెక్కలు వేసుకోవడంలో వాళ్ళకు సమయం చాలటం లేదు. పావనమూర్తి దగ్గర డబ్బుంది. కానీ చూపు మందగించింది. చిన్న చిన్న జబ్బులొచ్చి పడ్డాయి. భార్య గతించింది. పావనమూర్తి మంచాన పడ్డాడు. అతనికేదో తెలియని భయం, బాధ కలుగుతున్నాయి. పుట్టినవాడు గిట్టక తప్పదు. జరాదుఃఖం, జన్మదుఃఖం తప్పదు. తనింట్లో, తన గదిలో, తన డబ్బుతో, తన జబ్బుతో, తన దుఃఖంతో మునిగిపోయాడు పావనమూర్తి. ఈ అశాంతి ఒంటరితనం వల్ల కలిగిందనుకున్నాడు. తనకోసం ఒక్కరూ రారే? దేవుడు అన్ని కొబ్బరికాయలు తీసుకుని, ఇంత అశాంతి నెందుకు కలుగజేశాడో అర్థం కాలేదు. నర్సు వచ్చి రెండు మందు బిళ్ళలు నోట్లో వేసి నీళ్ళు పోసిపోయింది. పనివాడు కేరియర్ పెట్టిపోయాడు. రుచీ, పచీ తెలియని జిహ్వా, రెండు ముద్దలు మింగి చెయ్యి కడిగాడు. డబ్బు డాక్టరు, చెక్క సుత్తులు, స్టెత్ తాళ్ళు, గొట్టాలతో తనిఖీ చేసి, ‘ఎవ్విరిథింగ్ నార్మల్’ అంటూ రోజా పాడే పాట వినిపించి, వెళ్ళిపోయాడు.

పావనమూర్తి దుఃఖం క్షణక్షణానికి పెరుగుతోంది. అతి కష్టం మీద ప్రక్కకు దొర్లి కళ్ళు మూసుకున్నాడు. వడుం బాధతో కరేల్మంది. ‘అమ్మా!’ అన్నాడు పావనమూర్తి. చాలా ఏళ్ళ తరువాత నాలిక మీద తారాడిన రెండక్షరాలు. తల్లి రూపం కనులముందు మెదిలింది. జ్ఞాపకాల పొరల్లో తన పసితనం, లాలించిన అమ్మ.

పావనమూర్తి బాధగా మరింత గట్టిగా అమ్మా! అని పిలిచాడు. ఆర్తిగా, అశాంతిగా దిండు లాక్కున్నాడు. చెక్కుబుక్కూ, పెన్నూ, చేతికి తగిలాయి. పెద్దగా ఏడ్చి మూలకు విసిరికొట్టాడు. నర్సు పరుగెత్తుకొచ్చింది. డాక్టరు పావనమూర్తి అన్‌కాన్షస్ అయ్యాడన్నాడు. నిజానికి పావనమూర్తి అప్పుడే కాన్షస్‌గా ఉన్నాడు.

“నాకెందుకీ అశాంతి?” పావనమూర్తి కనబడని దేవుణ్ణి ప్రశ్నిస్తున్నాడు.

“ఏది కోరిన వారికదే ఇచ్చాను పావనమూర్తీ! నువ్వు కొట్టిన ఆరువేల మూడువందల తొంభై కొబ్బరికాయలను, వెలిగించిన తొమ్మిదివేల అగరొత్తులకూ, డిబ్బీలో వేసిన ఏడువేల నూట ఒక్కరూపాయికి, నువ్వుకోరినట్టుగానే నీకు ఇల్లూ, పిల్లలూ, చదువులు, ఉద్యోగాలు, డబ్బూ ఇచ్చాను. శాంతిని నువ్వు కోరలేదు కనుక అది నీకు లభ్యం కాదు” పావనమూర్తి చెవిలో దేవుడు పలికిన మాటలు వినబడ్డాయి.

పావనమూర్తి అస్పష్టంగా ‘అమ్మా!’ అన్నాడు. తెరుచుకున్న అతని పెదవులు మూతపడలేదు.”

